శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## ఓలేటి నాగేశ్వరరావు మృతిపట్ల వార్త సిబ్బంది సంతాపం



**కావలిరూరల్, జూన్ 17 ప్రభాతవార్త** కావలి వార్త జాతీయ దినపత్రిక సీనియర్ రిపోర్టర్, ఆర్యవైశ్యప్రముఖులు ఓలేటి నాగేశ్వరరావు సోమవారం అర్ధరాత్రి తీవ్రఅనారోగ్య కారణంగా చికిత్స పొందుతూ ఆకస్మికంగా మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న నెల్లూరు వార్త ఇన్‌చార్జి బ్రాంచ్ మేనేజర్, సహచర విలేకరులు మంగళవారం ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. తమ సహచర సీనియర్ రిపోర్టర్, శ్రేయోభిలాషి అకాలమృతిపట్ల తీవ్రదిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

## కండలేరులో 36.456 టీయంసీల నీటిమట్టం



**రాపూరు, జూన్ 17 ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జళాశయంలో మంగళవారం ఉదయం నాటికి జళాశయంలో 37.456 టీయంసీల నిటిమట్టం నమెదు అయినట్లు కండలేరు ఎఇ తిరుమలయ్య తెలిపారు. జళాశయం నుండి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 2380 క్యూసెక్కులు, లో లేవల్ స్యూయిస్ ద్వారా 70 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 50 క్యూసెక్కుల చోప్పున మొత్తం 2500 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

# తీరు మారని డ్వామా...!

**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 17, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లాలో ఇష్టానుసారంగా బదిలీలు చేస్తున్నారని వార్తలో జూన్ 11న ప్రచురితం అయిన డ్వామాలో బదిలీల డ్రామా అనే శీర్షిక ప్రచురితం అయిన సంగతి పాఠకులకు విధితమే.. అయితే డ్వామాలో హుటా హుటిన రెండు నెలల ముందు ఉదయగిరిలో ఉపాధి హామీ పనులకు సంబంధించి 96 లక్షల ఫైల్స్ సోషల్ ఆడిట్ వారికి అప్పజెప్పకుండా ఉన్న అత్యధిక రికవరీ పడ్డ జిల్లాలో నిలిచిన ఉదయగిరి మండలం లో సస్పెండ్ అయిన ఏ పి వో శ్రీనివాసులు, టీ ఏ మనోజ్, కంప్యూటర్ ఆపరేటర్ సుభాషిణి, అక్కడ పని చేసిన ఇద్దరు ఈసిలు అయిన మురళి, శ్రీనివాసులులకు డ్వామాలో హెచ్ ఆర్‌గా పని చేస్తున్న ఆనంద్ పోస్టింగ్ ఇచ్చినట్లు తెలిసింది. ఆత్మకూరులో ఇటీవల అన్ అఫిషియల్‌గా పని చేస్తున్న వసుధను అనంతసాగరం పంపించి ఆత్మకూరుకు ఉదయగిరిలో సస్పెండ్ అయ్యిన సుభాషిణికి పోస్టింగ్ ఇచ్చారు. అంటే డ్వామా పీడీకి తెలియకుండా పని చేయిస్తూ పత్రికలో వార్త వస్తె మళ్ళీ సరిచేయడం పట్ల ఎంతటి పని అయినా హెచ్ ఆర్ సెక్షన్‌లో అయిపోతుంది అని అర్థం అవుతుంది. జిల్లా కలెక్టర్ కి సోషల్ ఆడిట్ సంబంధించిన ఫైల్స్ పూర్తి స్థాయిలో అందుబాటులో పెట్టకుండా సోషల్ ఆడిట్ సెక్షన్, హెచ్ ఆర్ సెక్షన్, ఫైనాన్షియల్ సెక్షన్ వారు చేతులు తడిపిన వెంటనే పోస్టింగ్ వల్ల ఇష్టం వచ్చినట్లు మారుస్తున్నట్లు ఉపాధి హామీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్వామా లో డిప్యూటేషన్ పై పని చేస్తున్న వారి లిస్ట్, జీతాలు మండలాల్లో, పని డ్వామాలో పని చేస్తున్న వారు, సెక్షన్‌లు డ్వామా లోనే 10 సంవత్సరాలుగా పని చేస్తున్న వారి జాబితా పై కలెక్టర్ విచారణ చేపడితే మరిన్ని విషయాలు బయటకు వస్తాయని డ్వామా ఉద్యోగులు వేడుకుంటున్నారు.




## రోడ్డు ప్రమాదాల నివారణకు మంత్రి ఆనం చొరవ
## రంగంలోకి దిగిన ఆత్మకూరు పోలీసులు




**ఆత్మకూరు, జూన్17,ప్రభాతవార్త:** నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై ఏఎస్‌పేట క్రాస్ రోడ్డువద్ద ఇటీవల కాలంలో వరుస ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణకు స్థానిక శాసనసభ్యులు , రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వెనువెంటనే నివారణా చర్యలు చేపట్టాలని ఆయన నేషనల్ హైవే అథారిటీ అధికారులకు, పోలీస్ యంత్రాంగానికి సిఫార్స్ చేశారు. దీంతో ఆత్మకూరు పోలీసులు కార్యాచరణ చేపట్టారు. ఏఎస్‌పేట క్రాస్ రోడ్డు వద్ద రెండువైపులా ప్రమాదనివారణకు ప్రమాద సూచికలను బారికేడ్‌లను ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను కూడా గుర్తించి ప్రమాద నివారణ ఏర్పాట్లను చేయాలని మంత్రి రామనారాయణరెడ్డి ఆదేశాలిచ్చారు. దీంతో ఆత్మకూరు సిఐ గంగాధర్, ఎస్ఐ లు జిలానీ, సాయిప్రసాద్, శ్రీనివాసులురెడ్డిలు మంగళవారం తమ సిబ్బందితో కలిసి ఏఎస్‌పేట క్రాస్‌రోడ్డు సమీపంలో నెల్లూరు-ముంబాయి జాతీయరహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేశారు. వీటి ఏర్పాటు వలన వాహనాల వేగం తగ్గి ప్రమాదాలను నివారించవచ్చు. తరచూ జరుగుతున్న ప్రమాదాల పట్ల ప్రజల రక్షణ కొరకు తక్షణమే ప్రమాద నివారణకు చొరవచూపిన మంత్రి ఆనంకు, ఆత్మకూరు పోలీస్ యంత్రాంగానికి ఆత్మకూరు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## సీనియర్ పాత్రికేయులు ఓలేటి నాగేశ్వరరావు నేత్రదానం

**కావలిరూరల్, జూన్17 ప్రభాతవార్త** వార్త జాతీయ దినపత్రిక సీనియర్ పాత్రికేయులు, ఆర్యవైశ్య ప్రముఖులు ఓలేటి నాగేశ్వరరావు(65) ఆకస్మిక మరణం కావలి ప్రజలకు, స్వచ్ఛంద సంస్థలకు తీరనిలోటు అని కావలి రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాకారపు రవిప్రకాష్ మంగళవారం తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంత విషాదంలో కూడా అభయం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు ఇలింద్ర శ్రీవాణి ప్రేరణతో కుటుంబసభ్యులు వారి నేత్రాలను దానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని తెలియచేశారు. ఓలేటి నాగేశ్వరరావు కుటుంబసభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేశారు.



## దామెర్ల శ్రావణ్‌కుమార్ అరెస్ట్

**కావలిరూరల్, జూన్17 ప్రభాతవార్త** ఫ్లెక్సీల విషయానికి సంబంధించి సోషల్‌మీడియా నందు అసభ్యకరంగా పోస్టులు చేసినటువంటి దామెర్ల శ్రావణ్‌కుమార్‌ను కావలి టూటౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్‌చేయడం జరిగింది. కావలి టూటౌన్ పోలీసుల సమాచారం మేరకు కావలి పట్టణంలోని ఐ కాన్ సెంటర్ వద్ద ఇటీవల జరిగిన టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఆత్మీయ సమావేశానికి సంబంధించి బీద రవిచంద్రపై, కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డిపై ఫ్లెక్సీల విషయానికి సంబంధించి సోషల్ మీడియా నందు అసభ్యకరంగా పోస్టుచేసి ఇరువర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టినటువంటి జలదంకి మండలం అన్నవరం గ్రామానికి చెందిన దామెర్ల శ్రావణ్‌కుమార్‌ను అతని ఇంటివద్ద కావలి టూటౌన్ ఎస్ఐ ఎస్‌కె.గౌస్‌బాష సిబ్బందితో కలిసివెళ్లి అదుపులోకి తీసుకుని అరెస్ట్‌చేయడం జరిగింది. అనంతరం కావలి ఎజెఎంఎఫ్‌సి కోర్టునందు హాజరుపరచగా తే.30.06.2025ది. వరకు రిమాండ్‌కు ఇవ్వడమైనదని తెలియచేశారు.

# అట్టహాసంగా డిడి సదారావు వీడ్కోలు కార్యక్రమ నిర్వహణ

- డిడి సదారావుకు ఘనమైన వీడ్కోలు
- డిడి సదారావు సేవలు మరువలేనివి
- డీఐపిఆర్ఓ కార్యాలయ సిబ్బంది



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 17, ప్రభాతవార్త** నెల్లూరు నెల్లూరు జిల్లా డిఐపిఆర్ఓ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఐఎన్‌పిఆర్ డిడి సదారావు వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విశాఖపట్నం డిఐపిఆర్ఓగా బదిలీలో భాగంగా నెల్లూరులో తమ బాధ్యతలను విరమిచ్చుకుంటూ వీడ్కోలు తెలిపారు. ఈ కార్యక్రమం అండ్ పిఆర్ సీనియర్ అసిస్టెంట్లు సువర్ణ, ఖాదర్ మస్తాన్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఐ ఎన్ పి ఆర్ కార్యాలయం సిబ్బంది తమ తమ మనోభావాలను సదారావుతో తమకున్న రెండేళ్ల అనుభవాలను సభా సమక్షంలో అందరూ తెలియజేశారు. ముందుగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిఐపిఆర్ఓ శివశంకర్ మాట్లాడుతూ ఆత్యూన్నతమైన బాధ్యతను అప్పగించారని తమ బాధ్యతలను అప్పగించారని తమ బాధ్యతలను క్రమ బద్ధంగా నిర్వహిస్తానని డిడి సదారావు తో పనిచేయడం చాలా సంతోషకరమని ఈ సందర్భంగా తెలియజేశారు సీనియర్ అసిస్టెంట్ ఖాదర్ మస్తాన్ మాట్లాడుతూ.. . డిడి సదారావు తో తనకున్నా సన్యహిత్యాన్ని అందరితో పంచుకున్నారు ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన తర్వాత ప్రమోషన్లు ట్రాన్స్ఫర్లు రిటైర్మెంట్లు సర్వ సర్వ సహజమని డిడి సదారావు ప్రతి విషయాన్ని చర్చించి పనిచేశామని డిడి సదారావు గారు బదిలీ అవడం చాలా బాధాకరమైన విషయం అని తెలిపారు. ఏ వి యస్ ఫరీద్ మస్తాన్ మాట్లాడుతూ తనకున్న 40 ఏళ్ల సర్వీసులో ఎంతో మంది డిఐపిఆర్ఓ లు చూశానని కానీ సదారావు లాంటి డిఐపిఆర్ఓ అని అరుదుగా చూస్తామని నిర్మాణ పనులు గాని మత్తులు గాని వీడియో కెమెరాలు ఫోటో కెమెరాలు సదా రావు అడిగి ఇప్పించడం చాలా సంతోషమని సందర్భంగా తెలియజేశారు. రికార్డ్ అసిస్టెంట్ శోభన్ మాట్లాడుతూ డిడి సదారావు తన తండ్రి లాంటి వాడిని నా కుటుంబ సభ్యుల తనను చూసుకున్నాడని ఏం అడిగి నా వెంటనే నెరవేరిచే వాడని మాట్లాడుతూ కంటతడి పెట్టుకున్నారు. అటెండర్లు సైతం తమ అభిప్రాయాన్ని పంచుకున్నారు చివరగా డి ఐ పీ ఆర్ ఓ సదారావు మాట్లాడుతూ ప్రభుత్వ బదిలీల్లో భాగంగా తనను విశాఖపట్నం బదిలీ చేశారని రెండేళ్ల క్రితం నెల్లూరు జిల్లాకు వచ్చానని ఆంధ్ర రాష్ట్రంలో అనేక జిల్లాలు తాము పని చేశామని నెల్లూరు జిల్లాలో పనిచేయడం చాలా సంతోషకరమని ఇక్కడ నుండి ఆనందంగా వెళుతున్నానని సదారావు తెలిపారు డి ఐ పి ఐ ఆర్ ఓ కార్యాలయానికి అనేక మరమ్మతులు గాని వస్తువులు గాని కలెక్టర్లు తను అడిగిన వెంటనే నెరవేర్చారని తెలియజేశారుకార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ లోపాలను సరిదిద్దామని అందరూ నిజాయితీగా పనిచే యాలని సమయం స్ఫూర్తి పాటించాలని కార్యాలయ పనివేళలో అందరూ కార్యాలయంలోనే ఉండాలని, పత్రిక విలేకరులందరూ తనకు ఎంతో సహకరించారని అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు వీడ్కోలుకు గైర్హాజరు డిఐసిఆర్ఓ సదారావు బదిలీ విషయం అందరికీ తెలిసినదే డిడి కార్యాలయంలో నేటి సాయంత్రం వీడ్కోలు కార్యక్రమం జరుపుతున్న సంగతి విధేయతమే కానీ ఈ వీడ్కోలు కార్యక్రమానికి ఏపీఆర్ఓ రవీంద్ర, వీడియో గ్రాఫర్ అరుణ్ రాకపోవడం గమనార్థకం.

# తల్లికి వందనం విద్యార్థులకు ఓ వరం

## నెల్లూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ

**నెల్లూరు, జూన్ 17, ప్రభాతవార్త-వైద్యం** కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన తల్లికి వందనం అనే పథకం విద్యార్థులకు ఓ గొప్ప వరమని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ తెలిపారు. తల్లికి వందనం పథకం అమలు పట్ల నెల్లూరులోని 16వ డివిజన్ గుర్రాల మడుగు సంఘంలో టీడీపీ కార్యకర్తలు నాయకులతో ఆమె సంబరాలు చేసుకున్నారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులు లోకేష్, నారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు చేత పట్టి ప్రదర్శించారు. స్థానిక టీడీపీ శ్రేణులు, తల్లిదండ్రులతో కలిసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో చదువుకునే ప్రతి బిడ్డకు తల్లికి వందనం నిధులు అందించారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని అన్నారు. ఇంట్లో చదువుకునే పిల్లలందరికి తల్లికి వందనం అందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబుకి ఆజన్మాంతం రుణపడి ఉంటామంటూ మహిళామణులు ప్రతిజ్ఞలు చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు మహిళా పక్షపాతి అని కొనియాడారు. ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి తల్లికి వందనం డబ్బులు పడటంతో తల్లులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పాలాభిషేకాలతో కృతజ్ఞతలు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి తల్లికి వందనం డబ్బులు పడుతాయన్నారు. ఇందుకోసం ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె తెలియజేశారు. డబ్బులు పడని వారు సమీపంలోని సచివాలయంలో సంప్రదించాలని సూచించారు. కారణం తెలుసుకుని ధృవీకరణ పత్రాలు ఇస్తే తల్లికి వందనం ద్వారా డబ్బులు అందుతాయని తాళ్లపాక అనురాధ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 16వ డివిజన్ కార్పొరేటర్ శ్రీకాంత్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు సాయి, యువత నాయకులు క్రాంతి, బూత్ కన్వీనర్లు బీఎల్‌ఓలు మహిళా టీం టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## బెంబేలిత్తుస్తున్న కరెంటు బిల్లులు

**బుచ్చి జూన్ 17 ప్రభాతవార్త** గత కొద్ది రోజులుగా కరెంటు బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కరెంటు బిల్లులో రకరకాల కారణాలతో ఎక్కువగా వస్తున్నాయని ప్రజలు తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు. ఒక్కొక్క ప్రభుత్వం ఒక్కొక్క విధానం పెట్టి ప్రజలతో ఆడుకుంటున్నారని ప్రజలు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరెంటు బిల్లులు ఎక్కువగా రావడం, దానికి తోడు కరెంటు బిల్లులు రేషన్ కార్డులకు,సంక్షేమపథకాలకు లింకు చేయడం ఏమిటని ప్రజలు తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వం కరెంటు బిల్లులు తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వం ఇదే పనిచేసిందని,ఈ ప్రభుత్వం కూడా ఇదే పని చేస్తుందని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



# పొదలకూరు ఆర్టీసి అభివృద్ధికి కృషి

- నెల్లూరు జోనల్ పరిధిలో త్వరలో 300 ఎలక్ట్రిక్ బస్సులు
- ఆర్టీసీ నెల్లూరు జోనల్ బోర్డు చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి

**పొదలకూరు, జూన్ 17, ప్రభాతవార్త** పొదలకూరులోని నూతన ఆర్టీసీ బస్టాండులో అన్ని రకాల సౌకర్యాలను కల్పించి పూర్వ వైభవం తీసుకొస్తామని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి వెల్లడించారు. ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆయన రాపూరు డిపో మేనేజర్ అనిల్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఆర్టీసీ వ్యవస్థను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ఆర్టీసీ ఆస్తులను మార్ట్ గేజ్ తనకా పెట్టి తెచ్చిన డబ్బులను పక్కదారి పట్టించారని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఆర్టీసీ వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా నెల్లూరు రీజియన్ కు త్వరలో 300 ఎలక్ట్రికల్ బస్సులు రానున్నట్లు చెప్పారు. పొదలకూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాన్ని 15 ఏళ్ల పాటు ఓఎస్ కింద లీజుకు ఇచ్చామన్నారు. ఇందులో భాగంగా భవనానికి రంగులు వేయడంతో పాటు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం, ప్రయాణికులకు వసతి సౌకర్యాలను కల్పిస్తామన్నారు. బస్టాండ్ ప్రాంగణం మొత్తం సిమెంటు ప్లాట్ ఫారమ్ నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. ఇక్కడ రాత్రి వేళల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా, ఆర్టీసీ ఆస్తుల పరిరక్షణ కోసం కేర్ టేకర్‌ను నియమించనునట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ అందిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకోవాలని సూచించారు. కాగా పొదలకూరు నుంచి బెంగళూరు, హైదరాబాద్, చెన్నై తదితర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను నడపాలని, అలాగే తెల్లవారు జామున 4 నుంచి 6 గంటల లోపల నెల్లూరుకు బస్సు సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా పలువురు సురేష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన సర్వేపల్లి ఇంచార్జ్ బొబ్బేపల్లి సురేష్ నాయుడు, పొదలకూరు మండల బిజెపి అధ్యక్షుడు పూల ప్రశాంత్, ఉపాధ్యక్షుడు చొప్ప వెంకటేశ్వర్లు, బిజెపి సీనియర్ నాయకులు చింతగింజల సుబ్రహ్మణ్యం, రాచపూటి ధనుంజయ రావు, సంగన పెంచల రెడ్డి, జి నారాయణ నాయుడు, దాసరి సురేంద్ర, ఓబులేసు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా పల్లకి సేవ

**కోవూరు, జూన్ 17 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పంచామృత సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకిషోర్ స్వామి, ఫణీంద్రస్వామి, భక్తులు ఉన్నారు.



## భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్



**నెల్లూరు క్రైమ్, జూన్ 17, ప్రభాతవార్త :** ఇటీవల బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్ పరిది లోని గౌడ హాస్టల్ సెంటర్ సమీపంలో హత్యకు గురైన లంక శైలజ కేసులో నిందితుడైన ఆమె భర్త విజయచంద్రను బాలాజీ నగర్ సిఐ సాంబశి వరావు మంగళవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే లంక విజయ్ చంద్ర, శైలజ దంపతులు బాలాజీ నగర్‌లో నివాసం ఉంటున్నారు. భర్త పై విపరీతమైన అనుమానం పెంచుకున్న భార్య శైలజ తరచూ అతన్ని వేధింపులకు గురి చేసేది. ఇదే సమయంలో ఆమె పుట్టింటి నుండి రావాల్సిన ఆస్తిపై కోర్టులో కేసు వేసి ఓడిపోయింది. ఇందుకుగాను సుమారు రూ. 40 లక్షల వరకు విజయ్ చంద్ర అప్పు చేయాల్సి వచ్చింది. ఈ కారణంగానే వారి కుమారుడి చదువు కూడా మధ్యలో ఆగిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇన్ని సమస్యలు ఉన్నప్పటికీ భార్య తనను తరచూ అనుమానపు వేధింపులకు గురిచేస్తుండడంతో విచక్షణ కోల్పోయిన భర్త విజయచంద్ర ఈనెల 14వ తేదీ ఉదయం భార్యను రోకలిబండతో కొట్టి హత్య చేశారు. ఈ సంఘటనపై శైలజ కుమారుడు శ్యామ్ సాత్విక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న బాలాజీ నగర్ పోలీసులు మంగళవారం నిందితుడు విజయచంద్రను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి అతనికి రిమాండ్ విధించారు. త్వరితగతిన కేసును ఛేదించడంలో ప్రతిభ కనపరిచిన సీఐ సాంబశివరావు, ఇతర సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## ఆటోలో నుండి పడి 108 వాహనం ఉద్యోగి మృతి



**సీతారామపురం జూన్ 17 ప్రభాతవార్త :** ప్రమాదవశాత్తు ఆటోనుండి జారిపడి సీతారామపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలోని 108 అంబులెన్స్ ఉద్యోగి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల మేరకు సీతారామపురం ఆరోగ్యకేంద్రం పరిధిలో 108 అంబులెన్స్‌లో ఇ.ఎం.పి గా పనిచేస్తున్న సీతారామపురంలోని రాజుగారి వీధికి చెందిన ఓంకారం వెంకట నారాయణరాజు 38 సంవత్సరాలు రోజు మాదిరిగానే రాత్రి డ్యూటి ముగించుకొని ఇంటికి వచ్చిన తరువాత తమ సమీప బందువు అనారోగ్యంతో బాధపడతుండడంతో వైద్య చికిత్సల కోసం ఆటోలో ఉదయగిరి కి వెళ్ళే గ్రామంలో బసినేని పల్లి గ్రామ సమీపాన నిద్రమత్తులో ప్రమాదవశాత్తు ఆటోలో నుండి జారి పడ్డాడని వెంటనే 108 అంబులెన్స్‌లో ఉదయగిరి ప్రభుత్వం ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారని కుటుంబసభ్యులు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమార్తెలున్నారు. అతని మృతితో కుటుంబం శోక సముద్రంలో మునిగిపోయింది. గ్రామంలో విషాధ చాయలు అలముకున్నాయి. తన ఉద్యోగ విధులను అంకిత భావంతో నిర్వహిస్తు అందరితో సౌమ్యుడుగా మంచి గుర్తింపు పొందిన వ్యక్తి అకాల మరణం చెందడం అందరిని తీవ్రంగా కలిచి వేసింది.

## తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి




**మనుబోలు జూన్ 17 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మంగళ,బుధవారాలో పొలం పిలుస్తోంది. కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలనే ఉద్దేశంతో మను బోలులోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం నాడు వ్యవసాయశాఖ అధికారులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడి శివనాయక్ మాట్లాడుతు ఈకార్యక్రమం ముఖ్యఉద్దేశం విత్తన ఎంపిక నుండి కోతల దశ వరకు రైతులు పంటల పట్ల ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి విత్తన శుద్ధి తదితర మెళుకువలు రైతులకు తెలియజేయడమైనది. అంతేకాకుండా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించేందుకు తగు సూచనలు సలహాలను తెలియజేశారు. ఏఒ వెంకటకృష్ణయ్య మాట్లాడుతు రైతులకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలన్నీ ప్రతి రైతుకి అందేటట్లు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నదాత సుఖీభవ పథకం త్వరలోనే అమలయ్యే అవకాశం ఉందని తెలియజేశారు. ఈకార్యక్రమంలో పచ్చిపాల రామిరెడ్డి, దండు చంద్రశేఖర్‌రెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్, మారంరెడ్డి రమణారెడ్డి, కలికి రమేష్‌రెడ్డి, చల్లగిరి ప్రసాద్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బెదిరిస్తే భయపడం సవాల్ విసిరిన చలపతిరావు



**కొడవలూరు, జూన్ 17 ప్రభాతవార్త :** రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు అయితే ఈ ప్రభుత్వంలో ఎన్నికల ముందు ప్రజలకు చెప్పిన మాటలు ఈరోజు ఒకటి కూడా అమలు కాలేదని నెల్లూరు జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని నార్త్ రాజుపాలెం గ్రామంలో వి సి ఆర్ అతిథి గృహంలో విలేకరుల సమావేశం మాజీమంత్రి నలపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4 వ తేదీన వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు కార్యక్రమానికి ప్రజలు కదం తొక్కి, తొండోపతండాలుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు వైకాపా నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. గత వైకాపా పాలనలో 9 హామీలతో అధికారంలోకి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 36 సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా ప్రజలలోకి నేరుగా తీసుకెళ్లారని, నేడు వైసిపి సర్పంచులను బెదిరించి, చెక్ పవర్ రద్దు చేస్తామని బూటకపు మాటలతో నేడు ఎంతోమంది సర్పంచులను టిడిపి లోకి ఆహ్వానం పలికిందని ఆయన ఎమ్మెల్యే ను సూటిగా ప్రశ్నించారు. అదేవిధంగా ప్రజల సంక్షేమమే వైయస్సార్సీపి లక్ష్యంగా భావించి పనిచేస్తున్న మాజీ మంత్రి ప్రసన్నకుమార్ రెడ్డి పైన అనైతిక వ్యాఖ్యలు చేయడం టిడిపి సభ్యులకు తగదని, కార్మికులకు సకాలంలో జీతాలు లేక ఎన్నో ఇబ్బందులు పడుతుంటే ఇటువంటి విషయాలపై ప్రస్తుత ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చర్యలు తీసుకోలేదన్నారు. ఎన్నో మహాసభల్లో అభివృద్ధి సంక్షేమం ప్రవేశపెడుతుందని మాటలకే పరిమితం అయ్యారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో విఫలం అయిందని, ఈరోజు తల్లికి వందనం పూర్తిస్థాయిలో జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కడంతో తల్లుల ఖాతాలో జమ అయ్యేది. ఈరోజు తల్లికి వందనం పేరు అది వైఎస్ఆర్సిపి పుణ్యమని, కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ఒక లక్ష 47 వేల కోట్లు అప్పు తెచ్చిందని, కానీ అభివృద్ధి శూన్యంఅని, ఎక్కడి నుంచో పెయిడ్ ఆర్టిస్టులను తీసుకువచ్చి వారి ద్వారా కోవూరు నియోజకవర్గంలో వైసిపి వర్గాలను దూషింప చేయటం జరుగుతుందన్నారు. పి ఫోర్,స్త్రీ నిధి, నిరుద్యోగ భృతి లాంటి పేరుతో పథకాలు అందిస్తున్నామని నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని వ్యాఖ్యానించారు. ఈ ప్రభుత్వంలో బెల్ట్ షాపులలో మద్యం, మత్తు పదార్థాలు విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని వీటికి సంబంధించి మూడు రోజుల్లో వివరణ ఇస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొచ్చు సుప్రియ, కోవూరు నియోజకవర్గం 5 మండలాల వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు, కాటంరెడ్డి నవీన్ రెడ్డి, సతీష్ రెడ్డి చెర్లో సతీష్ రెడ్డి, చిమట శేషగిరి బాబు, అత్తిపల్లి అనూప్ రెడ్డి, గొల్లపల్లి విజయ్ కుమార్, ఎంపీపీ గాలి జ్యోతి, కవర్ గిరి శ్రీలత, షాహుల్, బట్టేపాటి నరేందర్ రెడ్డి, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, కొండ శ్రీనివాసులు రెడ్డి, మాణిక్యరావు, సాయి, కోవూరు నియోజకవర్గ వైకాపా ఎస్సీ సెల్ అధ్యక్షులు అనపల్లి ఉదయభాస్కర్, తాటిపర్తి భాస్కర్, వైకాపా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయశాఖ నిర్వహించే మెగా మేళా కార్యక్రమం 19కి వాయిదా




**నెల్లూరు అగ్రికల్చర్, జూన్ 17, ప్రభాతవార్త :** జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఆకుతోట వద్దనున్న వ్యవసాయ పరిశోధన క్షేత్రంలో నిర్వహించే వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమం మెగా మేళా తొలుత అధికారులు ఈనెల 18న నిర్వహిసు _న్నట్లు ప్రకటిం చారు. అయితే కొన్ని అనివార్య కారణాలతో ఈ కార్యక్రమం 19కి వాయిదా పడింది. ఈ మేరకు వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరక్టర్ నర్సోజీరావు ఈ విషయాన్ని ఒక ప్రకటనలో తెలియజేశారు.

## రేపు లింగసముద్రంలో స్పెషల్ గ్రీవెన్స్‌డే

**లింగసముద్రం, జూన్ 17, ప్రభాతవార్త :** లింగసముద్రం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు తెలిపారు. కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తారని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వీవీపాలెంలో విద్యామిత్రకిట్స్ పంపిణీ



**వలేటివారిపాలెం జూన్ 17 ప్రభాతవార్త :** విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందని స్దానిక హైస్కూలు హెచ్ఎం కమల్‌కుమార్ అన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మంగళవారం వలేటివారిపాలెం హైస్కూలులో విద్యార్థులకు గ్రామస్తుల సహకారంతో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యాకిట్లను అందచేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్ర మంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందిస్తున్న నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు తదితర స్టేషనరీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార క్రమంలో తెదేపా నేతలు వలేటి మధు, వలేటి నరసింహం, కాకుమాని ఆంజనేయులు, గుత్తా కొండయ్య, తదితరులు విద్యార్థులకు కిట్స్‌ను బహుకరించారు. పాఠశాల చైర్మన్ వరలక్ష్మి, ఎంఈవో మల్లికార్జునరావు, మాజీ జెడ్పీటీసీ కూచిపూడి విజయ్, సీఆర్పీ శివరామయ్యతోపాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విజయనగరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే



**కందుకూరు, జూన్ 17, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా జూన్ 21న విశాఖ పట్టణంలో నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లపై విజయనగరం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రులు బీసీ జనార్ధన్, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, ఇతర శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులతో కలిసి కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## కావలి రెడ్‌క్రాస్ ద్వారా 135వ నేత్రదానం



**కావలిరూరల్, జూన్17 ప్రభాతవార్త :** కావలి పట్టణం ముసునూరు రాఘవేంద్ర కాలనీకి చెందిన తుమ్మల నారాయణమ్మ(86) మంగళవారం వృద్ధాప్యంతో మరణించారు. వారి కుటుంబసభ్యులు ఆమె నేత్రాలను దానం చేయడం జరిగింది. నెల్లూరు మోడ్రన్ ఐ బ్యాంక్ సిబ్బంది నాగేశ్వరరావు, కొండారెడ్డిలు ఆమె కార్నియాలను సేకరించడం జరిగింది. ఆమె కుమారులు తుమ్మల వెంకటరాజశేఖర్‌రెడ్డి, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ తుమ్మలరామిరెడ్డి, ఎపియస్ఆర్‌టిసి నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ కావలి డిపో కార్యదర్శి తుమ్మల రఘురామిరెడ్డిలకు కావలి రెడ్‌క్రాస్ ఛైర్మన్ దాకారపు రవిప్రకాష్ ధన్యవాదాలు తెలియచేసి మాట్లాడారు. ఆమె నేత్రదానంతో మరో నలుగురు కార్నియా అంధులకు చూపు వస్తుందని తెలియచేశారు. కళ్లను కాటికి పంపకుండా కబోదులకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

**అనంతసాగరం, జూన్17, ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల, పడమటికంభంపాడు గ్రామాల్లో మంగళవారం వ్యవసాయాధికారిణి ఇ.శైలజాకుమారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట పైర్ల ప్రాముఖ్యతను, వరిలో మొలక శాతాన్ని నిర్ధారించడం, విత్తన శుద్ధి, నారుమడి, నీరు, ఎరువులు, కలుపు యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సోమశిల సర్పంచ్ చలంశెట్టి పెంచలయ్య, విస్తరణాధికారి కృష్ణవేణి, వ్యవసాయ సహాయకులు కీర్తన, శివారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## నూతన తహసిల్దార్‌ను కలిసిన టిడిపి నాయకులు



**ఆత్మకూరు, జూన్17, ప్రభాతవార్త:** ఆత్మకూరు తహసిల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పద్మజా కుమారిని మంగళవారం టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆమె తహసిల్దార్‌ను శాలువాలు, బొకెలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో మహిళా నాయకులు పాల్గొన్నారు.

## చేజర్లలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం




**చేజర్ల జూన్ 17 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన చేజర్ల, మడపల్లి రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం రైతులతో వ్యవసాయ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.ఎస్ హిమబిందు పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతు వరి నారుమడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు తెలియజేశారు. అదే విధంగా పచ్చరొట్ట ఎరువులు, పిల్లిపెసర, జనుము, జీలుగా, విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అన్నదాత సుఖీభవ అర్హత పొందిన రైతులు, సంబందిత రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ అసిస్టెంట్లు ద్వారా తప్పనిసరిగా ఈకె వైసి చేసుంచుకోవాల్సిందిగా కోరారు. అన్నదాత సుఖీభవ అర్హత పొందిన రైతులు, సంబందిత రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ అసిస్టెంట్లు ద్వారా తప్పనిసరిగా ఈకెవైసి చేయించుకోవలసిందిగా తెలియజేశారు. టిడిపినాయకులు రావి లక్ష్మీ నరసారెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు ఎల్.సుజాత, డి.వి సుబ్బారావు, ఎస్ మమత, టి మమత రైతులు పాల్గొన్నారు.

## పోలం హద్దులు తోలగించారని తహశిల్దార్‌కు పిర్యాదు

**గోనుపల్లి, రాపూరు, జూన్ 17, ప్రభాతవార్త :** మండలంలోని గోనుపల్లి గ్రామ సమీపంలోని గోల్లబొయిన స్వామి వారి ఆలయానికి సమీపంలో వున్న తమ పోలం హద్దుల రాళ్ళు తోలగించి, సాగులో వున్న నిమ్మ చెట్లను ద్వంసం చేసారని భాదితులు మంగళవారం రాపూరు తహశిల్దార్ లక్ష్మీనరిసింహం కు పిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన గాలి శంకరమ్మ అనే తన పోలంలో తిరుపతి, నీరజ అనే వారు తమ పోలంలోని రాళ్ళను తోలగించి, నిమ్మ చెట్లు పెరికివేశారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాపూరు పోలీసులకు కూడా పిర్యాదు చేసినట్లు భాదితులు తెలిపారు. విచారణ నిర్వహించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

## ప్రభుత్వ వైద్యరంగ ప్రయివేట్ గుపెట్లోకి వెళ్లేలా చేయటం దారుణం




**నెల్లూరు, జూన్17 ప్రభాతవార్త విద్య :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభు త్వం ప్రభుత్వ వైద్య రంగాన్ని ప్రయివేట్ గుపె ట్లోకి వెళ్లేలా చర్యలు తీసుకోవటం అత్యంత దారుణమని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎంవి.రమణయ్య పేర్కొ న్నారు. మంగ ళవారం నగరంలోని స్థానిక జెట్టిశేషారెడ్డి కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహి ంచారు. మాట్లాడుతు ప్రభుత్వ,ప్రయివేట్ భాగస్వామ్యం(పిపిపి) పద్దతిలో చేపట్టడం విచారకమన్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభించిన, ప్రస్తుత ప్రభుత్వంలో ప్రారంభానికి నోచుకోనున్న వైద్యకళాశాలలు, వీటికి అనుభందంగా ఏర్పటే వైద్యశాలలను ప్రయివేట్ శక్తుల చేతుల్లోకి పంపాలని ప్రస్తుత ప్రభుత్వం చూస్తోందన్నారు. గత ప్రభుత్వం వైద్యరంగాన్ని నిర్వీర్యంచేసిందని చెబుతూనే ప్రస్తుత కూటమి ప్రభుత్వం పిపిపి విదానానికి పూనుకోవటం శోచనీయమని తెలిపారు. దీనిని తాము వ్యతిరేఖిస్తునామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో పంచాయితీ కార్యదర్శుల భాధ్యతల స్వీకరణ



**రాపూరు, జూన్ 17, ప్రభాతవార్త :** పంచాయి తీరాజ్‌లో సాధారణ బదీలలో బాగంగా మంగళ వారం రాపూరు మండలంలోని రెండు గ్రామ పంచాయితీల కార్యదర్శులు జాయిన్ అయ్యారు. మండలంలోన బోజ్జనపల్లి గ్రామ పంచాయితీ కార్యదర్శిగా వాకా వెంకటరమణ వంశీ నియ మితులైనారు. ఈయన పోదలకూరు మండలం ఇనుకుర్తిలో పనిచేస్తూ బదిలలో ఇక్కడకు నియమితులైనారు. పోదలకూరు మండలం చాట్లగోట్ల పంచాయితీ కార్యదర్శి రాపూరు విజయ భాస్కర రెడ్డి మండలంలోని సిద్దవరం గ్రామ పంచాయితీ కార్యదర్శిగా నియమితులైనారు. ఈ మేరకు వారు మండల కార్యలయంలో వారి నియామక పత్రాలను ఆందజేశారు.

## పాలనలో తేడా ప్రజలే గమనిస్తున్నారు : వైసిపి నాయకులు



**ఆత్మకూరు, జూన్17, ప్రభాతవార్త:** ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నవరత్నాల పథకాలతో ప్రనజలందరికి సంక్షేమ పథకాలు అందించిన వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి పాలనకు సూపర్ - 6 పథకాలతో నామమాత్రంగా పథకాలు అమలు చేసి ప్రజలను మోసం చేసిన కూటమి పాలనకు తేడాను ప్రజలు గమనిస్తున్నారన్నారు. అందుకే ఏప్రాంతంలో జగన్మోహన్‌రెడ్డి కార్యక్రమం జరిగినా వేలాదిగా తరలి వస్తున్నారని వైసిపి నాయకులు పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం 'జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వంలో తొలి ఏడాది పాలనలో 90శాతం హామీలు అమలు చేశారన్నారు. తమ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చేలా ప్రజలతో కలిసి అందరం పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఏడాదికాలంలో కూటిమ పాకులు పొడిచిన వెన్నుపోటును గుర్తు చేసేందుకే ఈ పుస్తకాన్ని ఆవిష్కరించామన్నారు. ఈకార్యక్రమంలో వైసిపి రాష్ట్ర మున్సిపల్ విభాగ కన్వీనర్ అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి పులిమి రమేష్‌రెడ్డి, నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగ్ కన్వీనర్ బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి, సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, నాయకులు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, ముతీవర్, ముజ్జు, సయ్యద్ జమీర్‌బాష, కల్పనారెడ్డి, హేమ, కొప్పోలు వెంకటేశ్వర్లు, నందవరం ప్రతాప్, జమ్ము, తోడేటి అశోక్, కలాం, సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇరిగేషన్ అధికారులు చోద్యం చూడకుండా రైతులను ఆదుకోండి ప్రస్తుతం సోమశిల జలాశయం నుండి ఉత్తరకాలువ ద్వారా త్మకూరు చెరువుకు నీటిని తరలిస్తున్నామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. అయితే చెరువులో చుక్కనీరు లేదు. ఎడగారు సాగుకోసం ఆత్మకూరు చెరువు ఆయకట్టు రైతులు ఎదురుచూస్తున్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులు సమాధానం చెప్పాలని వైసిపి పట్టణ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా ట్రిప్పర్ల ద్వారా ఆత్మకూరు చెరువు నుండి మట్టిని తరలిస్తున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రైతులకంటే రియల్‌ఎస్టేట్ నాయకులే ఇరిగేషన్ అధికారులకు ఎక్కువయ్యారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు ఈవిషయమై తగిన విధంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## పచ్చిరొట్టవిత్తనాలు పంపిణీ



**వలేటివారిపాలెం జూన్ 17 ప్రభాతవార్త :** మండలంలోని అంకభూపాలపురం, పోలినేనిచెరువు గ్రామాల్లో మంగళవారం పచ్చిరొట్టవిత్తనాలను రైతులుకు పంపిణీ చేశారు. మండలంలో సాగువుతున్న వరి, మినుము తదితర పంటలను స్దానిక వ్యవసాయాధికారి శేషారెడ్డి వ్యవసాయసహాయకులు సిహెచ్ రవీంద్ర, నాగరాజలుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వరి, మినుము పంటల సాగులో చేపట్టాల్సిన మెళుకవలను వివరించారు. వ్యవసాయ ం లాభదాయకంగా ఉండాలంటే భూసారపరీక్షలు చేయాలన్నారు. పంటమార్పిడి వ్యవసాయం చేపట్టాలన్నారు. భూములు సారవంతంగా ఉండాలంటే పచ్చిరొట్ట ఎరువులు వినియోగం శ్రేయస్కరమన్నారు. ఇందుకు అవసరమైన జనుములును పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సిహెచ్ రవీంద్ర, నాగరాజుతోపాటు రైతులు మాల్యాద్రి, పెగడా మోహన్‌తోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## "ఓలేటి " మృతి అత్యంత బాధాకరం



**ఆత్మకూరు, జూన్17, ప్రభాతవార్త:** సీనియర్ జర్నలిస్ట్ ఓలేటి నాగేశ్వరరావ్ మృతి అత్యంత బాధాకరమని సీనియర్ జర్న లిస్ట్ , ఎపియుడబ్ల్యుజె జిల్లా ఉపాధ్యక్షుడు సోమా వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ,నెల్లూరు జిల్లా గౌరవాధ్యక్షుడు, కావలి వార్త ఆర్‌సి ఇన్‌చార్జ్, తనకు అత్యంత ఆప్త, అభిమాన మిత్రుడు ఓలేటి నాగేశ్వరరావ్ ఆకస్మిక మృతి అత్యంత బాధకరమన్నారు. 36సంవత్సరాలుగా ఉదయం, వార్త ప్రతికల్లో తన సహచరుడిగా కలిసి ప్రయాణం సాగించామని, సౌమ్యుడు, వివాదరహితుడు , జర్నలిజంలో అపార అనుభవశాలి , సోదరుడు నాగేశ్వరరావ్‌మృతి తనకు అత్యంత బాధాకరమని , తీరని లోటు అని బాధాతప్త హృదయం తో నాగేశ్వరరావ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. నాగేశ్వరరావ్ మృతికి ఎపిడబ్ల్యుయుజె జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చిట్టెం శ్రీనివాసులు, ఇసి మెంబర్ ఎస్.శ్రీనివాసులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# ఆటో ట్రాక్టర్ డీ ముగ్గురికి తీవ్రగాయాలు



**మనుబోలు జూన్ 17 ప్రభాతవార్త :** మనుబోలు మండలంలోని కొలను కుదురు గ్రామంలో ఆటోను ట్రాక్టర్ ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైయ్యాయి. సోమవారం రాత్రి ఆ గ్రామానికి చెందిన గోను సురేంద్ర,గోను సుబ్రమణ్యం,ఆజ్జం ఉదయ్‌కుమార్‌లు గూడూరు నుండి ఆటోలో తమ గ్రామానికి వెళుతుండగా ట్రాక్టర్ అదుపు తప్పి ఆటోను ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు తీవ్రగాయాలు అయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108లో గూడూరు ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. మనుబోలు ఎస్ఐ శివ రాకేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను కలిసిన నిజ నిర్ధారణ జిల్లా కమిటీ



**నెల్లూరు సిటీ, జూన్ 17, ప్రభాతవార్త :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై తవ్వేకొద్ది అవినీతి, అక్రమాలు ఎస్సీ, ఎస్టీ బోగస్ జాబ్ కార్డులు చోటు చేసుకున్న తీరు సైదాపురం, రాపూరు, కలువాయి మండలంలో చోటుచేసుకుందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి ఉపాధి హామీ పనుల అవినీతిపై నిజనిర్ధారణ కమిటీ జిల్లా కన్వీనర్ కొప్పాల రఘు, సభ్యులు శేషం సుదర్శన్ కరపత్రం అందజేసారు. ఈ మేరకు వెంకటగిరి ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలను తీసుకువెళ్లి వివరించిన కొప్పాల రఘు. ఉపాధి హామీ పనులకు సంబంధించి రాపూరు 76 లక్షలు రూపాయలు అవినీతి చేసిన 14 మంది, సైదాపురం 59.08 లక్షలు, అవినీతి చేసిన 12 మంది అధికార సిబ్బంది, ఒక సైదాపురం పంచాయతీ సెక్రెటరీ ఎన్ఆర్ఈజీఎస్ నిధులు 20 లక్షల పైన చెక్కు డ్రా చేసిన విషయంపై సస్పెండ్ కలువాయి మండల పరిధిలో 162 ఎస్సీ ఎస్టీ బోగస్ జాబ్ కార్డు, 58.37 లక్షల రూపాయలు అవినీతి చేసిన అధికార సిబ్బంది 12 మంది అయితే కేవలం 6 మందిపై స్థానిక పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారని తెలిపారు. రాష్ట్రంలోనే ఉపాధి హామీ పనులపై తొలి కేసు నమోదు కావడం, భారీ అవినీతిని వెలికి తీయడంలో ప్రజల సంక్షేమం కోసం సహకరించిన ఎమ్మెల్యేకు, కుటమీ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.- రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎస్సీ కుటుంబాల బాధితులను ఆదుకోండిఏర్పేడు, వెంకటగిరి రహదారిపై కారు ప్రమాదంలో తీవ్ర గాయాలతో ప్రాణాపాయం స్థితిలో ఉన్న రాపూరు మండలం, జోరేపల్లి అక్కమాంబాపురం గ్రామం దళితవాడకు చెందిన ఎస్సీ కుటుంబాల వారు తిరుపతి రుయా హాస్పిటల్ చికిత్స పొందుతున్న వారిని ఆదుకోవాలని కోరారు.

# దుండిగం, ధర్మవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది



**దగదర్తి, జూన్ 17, ప్రభాతవార్త :** మండలంలోని దుండిగం, ధర్మవరం గ్రామ రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ ఈకేవైసీ చేయించుకోవాల్సిందిగా రైతులు కొద్దిమంది మాత్రమే మిగిలి ఉన్నారని ఆయా గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి చేయించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ద్వారా వివిధ కార్యక్రమాలలో చేసిన ఈకేవైసీని పరిగణలోకి తీసుకొని ఆయా రైతులకు ఈకేవైసీ చేసినట్లు పరిగణించడం జరిగిందని, గ్రామానికి కొద్దిమంది మాత్రమే మిగిలి ఉన్నారని వారే రైతు సేవ కేంద్రంలో సంప్రదించి ఈకేవేసీ చేయించుకోవాలని తెలిపారు. యూరియా కావాల్సిన రైతులు ఆర్ఎస్‌కేలో సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దుండిగం సర్పంచ్ బాలయ్య, సుబ్బా నాయుడు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయండి : ఏపీవో



**ఉదయగిరి, జూన్ 17, ప్రభాతవార్త :** ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయడానికి క్షేత్ర సహాయకులు కృషి చేయాలని ఉదయగిరి ఇన్‌ఛార్జీ ఏపీవో ఉమా మహేష్ తెలిపారు. మంగళవారం స్థానిక శ్రీ శక్తి భవనంలో క్షేత్ర సహాయకులతో ఆయన మాట్లాడుతూ మండలంలో నిర్ధేశించిన నీటి కుంటలు పండ్ల మొక్కల పెంపకం పట్ల రైతులకు అవగాహన కల్పించి ఆ దిశగా లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అప్పాజీ, ఈసీ తిరుపతిరావు, క్షేత్ర సహాయకులు టీఏలు, సీఓలు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వహిందూ పరిషత్ బజరంగ్‌దళ్ బీజేపీ కార్యవర్గ సభ్యులు ఎమ్మార్వోకు డైరీ అందజేత



**ఉదయగిరి, జూన్ 17, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి నూతన తహాశీల్దార్ ఎల్.రామ్‌మోహన్‌రావును విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, బీజేపీ కార్యవర్గం సభ్యులు మంగళవారం కలిశారు. విశ్వ హిందూ పరిషత్ తరుపున డైరీని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సత్వర పరిష్కారానికి సిబ్బంది చొరువ తీసుకునేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ బీజేపీ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లికి వందనంతో ఇంటింటా సంబరాలు



**వింజమూరు, జూన్ 17, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోనే ప్రతి తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడంతో ప్రతి ఇంట్లో తల్లుల కళ్ళల్లో సంబరాలు కనిపిస్తున్నాయని తెలుగుదేశం పార్టీ మాజీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్‌సిక్స్ ప్రకారం ఇచ్చిన మాట ప్రకారం ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉంటే అంత మందికి తల్లికి వందనం కార్యక్రమం కింద రూ.15వేల రూపాయలు అందించి తల్లుల వదనంలో చిరునవ్వులు చిందించారని, తల్లికి వందనంలో రూ.2000లు పాఠశాల అభివృద్ధికి మినహాయించి అటు పాఠశాలలను మెరుగుపరిచి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు రాష్ట్రంలోని పిల్లలందరిని చదివించాలని సంకల్పంతో తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. సూపర్ సిక్స్ హామీలలో ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పరిపాలన కొనసాగిస్తుందని అన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా రూ.67.27 లక్షల మంది విద్యార్థులకు అందజేశారు. గత ప్రభుత్వం అమ్మ ఒడితో 5000 కోట్లు ఖర్చు చేస్తే కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకానికి పది వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కుటుంబంలో ఒక్కొరికి మాత్రమే ఈ పథకాన్ని అమలు చేశారని, కానీ నేడు ఎంత మంది పిల్లలు ఉన్నా అంత మంది పిల్లల తల్లుల ఖాతాలో నగదు జమ చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఎస్సీ, బీసీ, ఎస్టీ మైనార్టీ డబ్ల్యూసీ విద్యార్థులు లబ్ధి పొందారన్నారు. కూటమి ప్రభుత్వ పారదర్శకతకు పెద్ద పీట వేస్తుందన్నారు. అలాగే ఉదయగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి సంక్షేమం సమపాళ్లలో సాగుతుందన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాలు పూర్తి స్థాయిలో కాకర్ల సురేష్ హయాంలో అభివృద్ధి చెందుతాయని ఆకాంక్షించారు. ముఖ్యంగా ఉదయగిరి నియోజకవర్గంలో ఉపాధి కల్పన నిరుద్యోగ నిర్మూలన లక్ష్యంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నిరంతరం పని చేస్తున్నాడన్నారు.

# ఉదయగిరి దుర్గంపై పేలుడు సామాగ్రి కలకలం



**ఉదయగిరి, జూన్ 17, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి దుర్గంపై పేలుడు సామాగ్రి కలకలం రేపుతుంది. రాత్రి వేళలో గుప్త నిధుల కోసం ఏర్పాటు చేసిన పేలుడు సామాగ్రిని దుర్గంపై పర్యాటకులు గుర్తించారు. ఈ విషయం ఆలస్యంగా మంగళవారం వెలుగు చూసింది. ఈ ఘటనపై సంబంధిత అధికారులు విచారణ మొదలు పెట్టారు. గతంలోనూ అనేక సార్లు ఉదయగిరి కొండపై గుప్త నిధుల కోసం క్షుద్ర పూజలు పేలుడు సామాగ్రితో తవ్వకాలు తెలిపారు. ఇలాంటి వాళ్లని గుర్తించి శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కిట్ల పంపిణీ



**వింజమూరు, జూన్ 17, ప్రభాతవార్త :** వింజమూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కిట్ల పంపిణీని పూర్తి చేసినట్లు ఎంఈఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఒకటి నుండి 10వ తరగతి విద్యార్థులకు 3209 కిట్లను అందజేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో బేసిక్ ప్రైమరీ 24 మోడల్ ప్రైమరీ 7 ఫౌండేషన్ పాఠశాలలు, 8 ప్రాథమికోన్నత పాఠశాలలో రెండు ఉన్నత పాఠశాలలో ఆరు ఉన్నాయని, అందులో ఒకటి నుండి 10వ తరగతి చదివే విద్యార్థులకు ఈ కిట్లను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలోని మూడు ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు నూతనంగా బాధ్యతలు చేపట్టారన్నారు. వింజమూరు బాలుర ఉన్నత పాఠశాలకు పి.నాగలక్ష్మీ గుండుమడగల ఉన్నత పాఠశాలకు ఆర్.కనకారావు కాటేపల్లి ఉన్నత పాఠశాలకు ఎం.వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారన్నారు. అంతే కాకుండా స్కూల్ అసిస్టెంట్లు 34 మంది మండలం నుండి బదిలీపై వెళ్లఅ 31మంది మన మండలానికి వచ్చారని ఆయన తెలిపారు. అలాగే సెకండ్ గ్రేడ్ టీచర్లు 22 మంది ఇతర మండలాలకు వెళ్ళగా 11 మంది మన మండలానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ బదిలీలలో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులున్నట్లు ఆయన తెలిపారు.

# రైలు ఢీకొని వ్యక్తి మృతి

**బిట్రగుంట,జూన్17,ప్రభాతవార్త:** విజయవాడ రైల్వే డివిజన్ పరిదిలోని అల్లూరు రోడ్ రైల్వేస్టేషన్ ఉత్తరపు యార్డ్‌న దిగువ లూప్‌లైన్‌లో రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందినట్లు జిఆర్‌పి పోలీసులు తెలిపారు.మృతుడి వయస్సు 40నుండి45సంవత్సరాల మద్య వుంటుందని బులుగురంగు జీన్స్ షర్టు,కాఫి కలర్ ప్యాంటు ధరించి వున్నాడని కుడిచేతిమీద బిందుశ్రీ,ఎడమచేతిమీద అమ్మ అని రెండు వైపుల సిలువ గుర్తు ఎడమ చాతిపైన కళ్యాణి అనే పచ్చబొట్టు వున్నాయన్నారు.మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

# జలదంకి పెద్దచెరువుకి వచ్చే సోమశిల నీటికి అడ్డుకట్ట ఆగ్రహించిన పులిగుంట



**జలదంకి, జూన్17, ప్రభాతవార్త:** జలదంకి పెద్దచెరువుకు కావలి కాలువద్వార సరఫంఅయ్యే సోమశిల జలాల పారుదలకు కొంత అవరోదము కలిగించడంపై సోమశిల ప్రాజెక్ట్ కమిటి వైస్ చైర్మన్‌పులిగుంట మధుమోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. చెరువు చేపల వేలంపాట దారులు నీరు పూర్తిస్తాయిలో చెరువుకు పారకుండ తూములో పెద్దరాళ్ళు అడ్డంకిగ వేశారని కొందరు ఆయకట్టు దారులు మధుమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చి బావురుమన్నారు.దీనివల్ల చెరువుకింద ప్రస్తుతం సాగులోవున్న ఎడగారు పైర్లకు నష్టం వాటిల్లి రైతాంగం నష్టపోతారని విన్నవించారు.దీంతో స్పందించిన మధుమోహన్‌రెడ్డి మంగళవారం కొందరు రైతులను వెంటబెట్టుకొని అప్పారావుసంఘం సమీపంలోని కాలువవద్దకు వెళ్ళారు.తూములో వేసివున్న బండరాళ్ళను గుర్తించారు. ఈచర్చకు ఎవరు పాల్పడ్డారని సంఘం వాసులను ఆరాతీశారు. అడ్డంకిని తొలగించేందుకు కాలువలోకి దిగి రైతులు ప్రయత్నించారు.అయినా ప్రవాహం ఎక్కువగ వున్నందున తొలగింపు సాద్యపడలేదు.దీంతో చేసేదిలేక వెనుదిరిగారు.ఈసమస్యను అదికారుల దృష్టికి తీసుకుపోయి కొంత నీటిప్రవాహం తగ్గేవిదంగ చేస్తేకాని వీలుపడదని ఆప్రయత్నం చేద్దామని మధుమోహన్‌రెడ్డి రైతులకు వివరిం చారు. రైతలులను నష్టపరచే చర్యలకు ఎవరు దిగిన ఒప్పుకునేదిలేదని చేపలు పెంపకందార్లు తూములు, కాలువలకు వలలు వేసుకుంటే ఫలితం వుంటుందికాని ఇలా అదికారులకు తెలియకుండ,సాగునీటి సంఘా నికి చెప్పకుండ వారిష్టం వచ్చినట్లు ప్రవర్తించడం కరెక్ట్ కాదని అన్నారు.వారుకూడ రైతులేకదా, ఎవరికో లాభంచేకూర్చే పనులకు దిగి కర్షకలోకాన్ని బాదపెట్టడం సమంజసమా అంటు పెదవివిరి చారు.భవిషత్‌లో ఇలాంటివి తిరిగి పునరావృతమైతే ఎవ్వరిని వదలమని కావున వేలంపాటదారులు గుర్తుం చుకోవాలని ఆయన తెలియజేశాడు.ఆయన వెంట చెరువునీటిసంఘ ప్రసిడెంట్ సుబ్బానాయుడు టిడిపి నేతలు వింతా సుబ్బారెడ్డి, ఏగూరి రఘు,మారుబోయిన నారాయణ,రైతులు వున్నారు.

# డిప్యూటి లేబర్ కమీషనర్ తనిఖీ



**బిట్రగుంట,జూన్17,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కప్పరాళ్ళతిప్ప వద్ద ఉన్న ఎఫ్‌సిఐ గోడామ్‌లను మంగళవారం స్టేట్‌వేర్ హౌసింగ్ గోడౌన్ డిప్యూటి లేబర్ కమీషనర్ వెంకటేశ్వరరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగ అక్కడ పనిచేస్తున్న కార్మికుల యోగక్షే మాలు,పనిలో వేతనాలు పనిదినాల పనితీరు అడిగి తెలుసుకున్నారు.కార్మికులందరికి ఈ శ్రమ గుర్తింపు కార్డులు ఇచ్చేల అవగాహన కల్పిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్మికుల ఇబ్బందులను సిఐటియు నేతలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈకార్యక్రమంలో సిఐటియు జిల్లా అద్యక్షుడు అజయ్‌కుమార్,మండల కార్యదర్శి నరహరి,సిపియం డివిజనల్ సీనయర్‌నేత తుమ్మల వెంకయ్య,రైతుసంఘం జిల్లా కమిటి నేతలు రెహనాబేగం,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా రీ సర్వే కార్యక్రమాలు పూర్తిచేయాలి



**కోవూరు, జూన్ 17 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని వేగూరు గ్రామంలో జరుగుతున్న రీ సర్వేకు సంబంధించి మంగళవారం కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య ప్రత్యేక సమీక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేకు సంబంధించి చేపట్టే ప్రాంతాల్లో రెండు రోజులు ముందుగా దండోరా వేసి ఆయా ప్రాంతాలకు సంబంధించిన రైతులు రీ సర్వే కార్యక్రమానికి హాజరయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు కూడా తమ భూములకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే ఈ సర్వేలో వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరించుకోవాలన్నారు. గత సంవత్సరాలుగా పరిష్కారం కాని భూ సమస్యలు ఈ సర్వే ద్వారా పరిష్కారం అయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రీ సర్వే చేస్తున్న సర్వే బృందాలు కూడా రైతులకుఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా తమకు కేటాయించిన బాధ్యతను పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన సర్వే బృందాలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, సర్వేయర్ రమేష్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ బషీర్, గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు ఉన్నారు.

# ప్రభుత్వ వైద్యశాల నందు జరిగిన ఘటన పై విచారణ



**ఉదయగిరి, జూన్ 17, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాల నందు 11వ తేదీన ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు ఓ మైనర్ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించారంటూ కుటుంబ సభ్యులు దాడికి యత్నించిన విషయం తెలిసిందే. మరుసటి రోజు కుటుంబ సభ్యులు అలాంటిదేమీ జరగలేదని క్షమాపణలు తెలిపిన విషయం కూడా తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ శాఖ జిల్లా అధికారులు ఆదేశాల మేరకు మంగళవారం అల్లూరు వైద్యశాల వైద్యులు కే.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైద్యులు సిబ్బందిని జరిగిన ఘటనపై విచారించారు.

# నూతన సాంకేతిక పద్ధతులపై అవగాహన పెంచుకోవాలి



**కోవూరు, జూన్ 17 ప్రభాతవార్త :** రైతు ఉత్పత్తి సహకార సంఘాలు ప్రస్తుతం వ్యవసాయంలో వస్తున్న నూతన సాంకేతిక పద్దతులపై పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందని ఏపీఎం సుబ్బరాజు అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం రైతు ఉత్పత్తిదారుల మహిళా గ్రూపు సభ్యులు వీవోఏలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ రంగంలో డ్రోన్ సాంకేతికత ద్వారా విత్తనాలను చల్లడం, క్రిమి సంహారక మందులు పిచికారి చేయడం వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఇటువంటి నూతన సాంకేతిక పద్దతులపై ఎఫ్‌పీ గ్రూపులు అవగాహన చేసుకోవాలన్నారు. అదేవిధంగా కిచెన్ గార్డెన్ వంటి వాటిపై కూడా దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా ఆయన గ్రూపులకు సూచించారు. ప్రస్తుతం ఒక గ్రూపులోకి ఇద్దరు సభ్యులకు సీఐఎఫ్ ద్వారా ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున రుణాలు అందజేయడం జరుగుతుందని, వాటిని వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీవోఏలు కూడా ఈ గ్రూపుల పట్ల ప్రత్యేక దృష్టి సారించి క్రమం తప్పకుండా వారు సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం, రికార్డు నిర్వహణ పారదర్శకంగా ఉండేలా వారు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు రాజశేఖర్, రాము, చైతన్య, శోభ, తదితరులు ఉన్నారు.

# ఓటర్ల మార్పులు, చేర్పులు, తొలగింపులు నిరంతర ప్రక్రియ



**కోవూరు, జూన్ 17 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో నూతనంగా ఓటర్లు చేర్చుకోవడం, మార్పులు తొలగింపులు వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఈ విషయంలో రాజకీయ ప్రతినిధులు అవగాహన చేసుకోవాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కోవూరు నియోజకవర్గ స్థాయి అన్ని పార్టీల రాజకీయ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలలో జరిగే ఈ సమావేశాలకు రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరై పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన ఏమైనా సమస్యలు ఉన్నా , బిల్డింగ్‌లు సరిగా లేకపోయినా, బీఎల్‌వోల పనితీరు తదితర అంశాలపై చర్చించవచ్చన్నారు. అదేవిధంగా ఎక్కడైనా పోలింగ్ కేంద్రాలు ఓటర్లకు దూరంగా ఉంటే అటువంటి విషయాలు కూడా ఈ సమావేశంలో చర్చించవచ్చన్నారు. ఈ సందర్భంగా పలు పార్టీల ప్రతినిధులు కొంతమంది నివాసంలో నెల్లూరులో ఉంటూ గ్రామాల్లోనూ, నెల్లూరులోనూ ఓటు హక్కు కల్పించుకుంటున్నారని అటువంటి వారిని గుర్తించి అవి తొలగించేలా తగు చర్యలు తీసుకోవాలని సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా బీఎల్‌వో జాబితా కూడా తమకు ఇవ్వాలని పలు పార్టీల ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి నెలలో జరిగే ఈ సమావేశాలకు ఆయా పార్టీల ప్రతినిధులు హాజరై పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే సమావేశం దృష్టికి తీసుకురావాలన్నారు. బుచ్చి తహసీల్దార్ వెంకటేశ్వర్లు, కొడవలూరు తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డి, ఇందుకూరుపేట డిప్యూటీ తహసీల్దార్ సురేష్, విడవలూరు తహసీల్దార్ చంద్రశేఖర్, కోవూరు ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సురేష్, సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, టీడీపీ, బీజేపీ, జనసేన, వైసీపీ, బీఎస్పీ, సీపీఎం, సీపీఐ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రతి రైతు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి




**కోవూరు, జూన్ 17 ప్రభాతవార్త :** అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఈ నెల 20వ తేది నుంచి నిధులు వారి వారి ఖాతాల్లో జమ అవుతాయని ఈకేవైసీ చేయించుకోని రైతులు వెంటనే చేయించుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు అనిత అన్నారు. కోవూరు మండలంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో పంట వేసి ప్రతి రైతు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం వ్యవసాయం సాగు చేసే రైతులు వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు, ఎరువుల యాజమాన్యం సస్యరక్షణ తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రస్తుతం సాగు చేస్తున్న వరిలో అక్కడక్కడ ఆకునల్లి తెగులు సోకిందని, దీని నివారణకు ప్రొఫోనోపాస్ 2.0 మిల్లీలీటర్లు, ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి రజని, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్‌కే మెహర్నిసా, చైతన్య, రైతులు ఉన్నారు.

# యోగాంధ్ర రిజిస్ట్రేషన్ మరింత వేగవంతం కావాలి



**కోవూరు, జూన్ 17 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్రపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ఈ రిజిస్ట్రేషన్ నమోదు మరింత వేగవంతం కావాలని డిప్యూటీ డీఈవో వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యోగాంధ్ర రిజిస్ట్రేషన్‌లో పాఠశాల విద్యార్థులతో పాటు కాంప్లెక్స్ పరిధిలో ఉన్న విద్యార్థుల నమోదు కూడా మరింత వేగవంతం చేయా లన్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్దేశించిన ప్రమాణలతో విద్యార్థులకు అంద జేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన విద్య కిట్లను ప్రతి విద్యార్థికి క్రమం తప్పకుండా అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోఫియా కిరణ్మయికి పలు సూచనలు చేశారు.

# వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, జూన్ 17 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకిషోర్ స్వామి, ఫణీంద్రస్వామి, భక్తులు ఉన్నారు.

## వైద్య ఆరోగ్యశాఖలో బదిలీల పక్రియ ప్రారంభం



**నెల్లూరు, జూన్ 17, ప్రభాతవార్త-వైద్యం** రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖలో బది లీల పక్రియ ప్రారంభమైంది. ఇందులో భా గంగా నెల్లూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ సుజాత, రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న వెబ్ కౌన్సిలింగ్‌లో నెల్లూ రులోని తన కార్యాలయం నుంచి పాల్గొ న్నారు. జిల్లాలో ఐదేళ్ల ఒకే చోట ఉండి పని చేసిన వైద్యులు 12 మందికి ఈకౌ న్సిలింగ్ పక్రియను నిర్వహించారు. కౌన్సిలింగ్ అనంతరం వివిధ జిల్లాల్లో వీరికి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ సుజాత మాట్లాడుతూ ఈ సీజన్లో చిన్న పిల్లల్లో వచ్చే అతిసార వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా నెల్లూరు జిల్లాలో కూడా అతిసార వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. నెల్లూరు జిల్లాలో ఈనెల 16 నుంచి ప్రారంభమైన అవగాహన కార్యక్రమాలు జులై 31వరకు కొనసాగుతాయని ఆమె తెలిపారు. ఈ అవగామన కార్యక్రమాల్లో ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఎలా కలుపుకోవాలి, ఐదేళ్ల లోపు పిల్లలకు ఎంత మోతాదు వాడాలి, జింక్ టాబ్లెట్లు ఎంత మోతాదు ఇవ్వాలి అనే విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. ఇందులో భాగంగా జిల్లాలోని 52 పీహెచ్‌సీలు 28 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మొదట సిబ్బందికి అవగాహన కల్పించామని చెప్పారు. వీరంతా ప్రజలకు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

## వ్యవసాయశాఖ పథకాలపై రైతులకు అవగాహన



**సైదాపురం, జూన్ 17, ప్రభాతవార్త** మండల కేంద్రమైన సైదాపురం-1 రైతు సేవా కేంద్రం పరిధిలో మండల వ్యవసాయశాఖ అధికారిణి హైమావతి మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందిసు_న్న అభివృద్ధి పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా అన్నదాత సుఖీభవ పథకం, ఖరీఫ్ పంటలపై రైతులకు వివరించారు. వ్యవసాయ సహాయకురాలు పుష్ప, రైతులు పాల్గొన్నారు.

## 21 యోగాంధ్ర ఇంటర్‌నేషనల్ డే విజయవంతం చేయండి



**బుచ్చి జూన్ 17 ప్రభాతవార్త** 21 న జరిగే యోగాంధ్ర ఇంటర్‌నేషనల్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఓ ఎం.నారాయణరెడ్డి, తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఇ పెంచలయ్య, పిలుపు నిచ్చారు. ఎంపిడిఓ కార్యాలయంలో యోగా డే నిర్వహణపై జరిగిన సమావేశంలో తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు అన్ని శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరు ఇంటర్‌నేషనల్ యోగా డేని అట్టహాసంగా చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆయుష్ డిపార్ట్మెంట్ యోగా మాష్టార్ జె.రాజేంద్రకుమార్, బి.వెంకటలక్ష్మీ, పి.శ్రీనివాసులు, అంతర్జాతీయ యోగాడే ప్రోటోకాల్ గురించి తెలియజేశారు. ఈకార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు హాజరైయ్యారు.

## వేంగమాంబ సన్నిదిలో మాజీ ఐఆర్ఎస్ రాధారమణ



దుత్తలూరు, జూన్17, ప్రభాతవార్తః భక్తుల కొంగుబంగారం నర్రవాడ శ్రీ వేంగమాంబ పేరంటాళ్ళు బ్ర హ్మోత్స వాలలో భాగంగా జరుగుతున్న ప్రత్యేక పూజల్లో కర్ణాటక రాష్ట్ర మాజీ ఐఆర్ఎస్ అధికారిణి రాదారమణ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. వీరిని ఉదయగిరి నియో జకవర్గ తెలుగు యువత అధికార ప్రతినిధి చల్లా ప్రసాద్ తీసుకొనిపోయి ఆలయ విశిష్టతను వివరిం చారు. అమ్మవారిని దర్శింపజేసి పూజలు నిర్వహింపచేశారు. అమ్మవారి ఉత్స వాలలో పాల్గొనందుకు వారు సంతోషం వ్యక్తం చేశారు.

## సీనియర్ పాత్రికేయులు ఓలేటికి జర్నలిస్ట్‌క్లబ్ ఘననివాళి



**కావలిరూరల్, జూన్17 ప్రభాతవార్త** సీనియర్ పాత్రికే యులు, జర్నలిస్ట్‌క్లబ్ వ్యవస్థా పకుల్లో ముఖ్యులైన వార్త జా తీయ దినపత్రిక విలేకరి ఓలేటి నాగేశ్వరరావు అకాలమరణం పాత్రికేయరంగానికి, జర్నలిస్ట్‌లకు తీరలిలోటు అని పలువురు జర్నలిస్టులు పేర్కొన్నారు. స్థానిక రైల్వేరోడ్డులోని జర్నలిస్ట్‌క్లబ్ నందు మంగళవారం ఓలేటి నాగేశ్వరరావు చిత్రపటానికి జర్నలిస్ట్‌క్లబ్‌లో జర్నలిస్ట్‌లతో పాటు కావలి జర్నలిస్ట్‌లందరూ పాల్గొని మంగళవారం పూలమాలలువేసి, ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాత్రికేయరంగంలో గత 40 సంవత్స రాలుగా నాగేశ్వరరావు పాత్ర ఎనలేనిదన్నారు. పాత్రికేయులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా నేనున్నాని ముందుకు వచ్చి ఒక పెద్దన్నపాత్ర పోషించారని తెలియచేశారు. జర్నలిస్ట్‌క్లబ్ ఏర్పాటులో కీలకపాత్ర పోషించి గత 6 సంవత్స రాలుగా పార్టీలకు, కుల, మతాలకు అతీతంగా ఎన్నో సంచలనాత్మక వార్తలు అందించిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందని తెలియచేశారు. పాత్రికేయరంగంలో జూనియర్స్‌ను ఆహ్వానిస్తూ వారికి ఎన్నోసూచనలు, సలహాలిస్తూ వారికి మనోధైర్యాన్ని నింపిన అక్షరయోధుడు ఓలేటి నాగేశ్వరరావు అని ముక్తకంఠంతో అభిప్రాయం వ్యక్తం చేయడం జరిగింది.

## అందే శ్రీనివాసులుకు ఆత్మీయసత్కారం




**నెల్లూరు, జూన్17 ప్రభాతవార్త -విద్య** ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని స్థానిక టౌన్‌హాల్‌లో ఎస్‌వీఆర్ స్కూల్ కరస్పాండెంట్ అందే శ్రీనివాసులుకు ఆత్మీయ సత్కానాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత లయన్ డాక్టర్ ఎ నటరాజ్ మాట్లాడుతు పాఠశాలల నిర్వహిస్తూ విద్యార్దులకు అతి తక్కువ ఫీజులతో ఉత్తమ విద్యను అందించటంతోపాటూ సమాజిక చైతన్య కార్యక్రమాలు, చేపడుతున్న అందే శ్రీనివాసులు అదర్శప్రాయులన్నారు. ఆయన సేవలకు సేవా రంగంలో గౌరవ డాక్టరేట్ రావటం అభినందనీయమని కొనియాడారు. రానున్న రోజుల్లో ఆయన మరింత ఉన్నత అవార్డులు అందుకోవాలనికోరారు. అనంతరం ముఖ్యఅతిధులు శాలువాలుకప్పి పుష్పగుచ్ఛాలతో అందేను ఘనంగా సత్కరించారు. జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో లయన్ ఎస్.రామచంద్ర రావు, ఎస్‌వీఆర్ పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్, లక్ష్మీనారాయణ, నిర్వాహకులు మురళీ, ఆనందయ్య, రియాజ్, చీదరాల చెన్నయ్య, అంకబాబు, మురళీ, ఎస్ఎస్ యాదవ్, శశిధర్, సత్యనారాయణ, రమణయ్య, రవి ,జోష్న తదితరులు పాల్గొన్నారు.

## నిర్దేధించిన మెనూను తప్పక అమలు చేయాలి



**కోవూరు, జూన్ 17 ప్రభాతవార్త** : ప్రభు త్వ పాఠశాలల్లో నిర్దేశించిన మెనూను తప్పక అమలు చేసేలా మధ్యాహ్న భో జన పథకం ఏజెన్సీలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని డిప్యూటీ డీఈవో వెంక టేశ్వర నాయక్ అన్నారు. కోవూరులోని జేబీఆర్ ప్రభుత్వ పాఠశాలలో మంగ ళవారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా భోజ నాన్ని రుచి చూడడమే కాకుండా విద్యా ర్థులతో ప్రత్యేకంగా మధ్యాహ్న భోజన పథకంపై మాట్లాడారు. విద్యార్థులంతా తమకు ఇస్తున్న ఈ భోజనం బాగుందని డిప్యూటీ డీఈవోకు సమాధానం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలు ప్రతి పాఠశాలలో భోజనం తయారు చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రతి రోజూ ఏయే భోజనం అందించాలో, ఏయే కూరలు విద్యార్థులు పెట్టాలో ఒక మెనూను ఏర్పాటు చేసిందని, దాని ప్రకారమే నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. ఈ పాఠశాల అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం బాగుందని, దీనిని నిరంతరం ఉండేలా ఏజెన్సీలు చూడాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. శ్రీహరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

## ఖాదర్‌బాషాకు నివాళులర్పించిన టిడిపి నాయకులు



**కావలిరూరల్, జూన్17 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ కావలి పట్టణ నాయకులు, తెలుగుదేశంపార్టీ మైనారిటి సెల్ రాష్ట్రకార్యదర్శి షేక్.ఖాదర్‌బాషా(ఇట్టు) సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి సూచనలమేరకు మంగళవారం కావలి టిడిపి కార్యాలయంలో కావలి పట్టణ తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో ఖాదర్‌బాషా చిత్రపటం ఏర్పాటుచేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడారు. ముస్లింల అభ్యున్నతికి, టిడిపి పార్టీకి ఖాదర్‌బాషా చేసిన సేవలను కొనియాడారు. గొప్పనాయకుడిని తెలుగుదేశంపార్టీ కోల్పోవడం జరిగిందని తెలిపారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. అనంతరం కావలి పట్టణం ఇస్లాంపేటలోని ఖాదర్‌బాషా ఇంటివద్ద నుండి ప్రారంభమైన అంతిమయాత్రలో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొని కడసారి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధానకార్యదర్శి జ్యోతిబాబురావు, రాష్ట్రకార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు బొట్లగుంట శ్రీహరినాయుడు, దావులూరి దేవకుమార్, శానం హరి, రఫి, కిరణ్, రహీమ్, మస్తాన్, నారాయణ, కావలి పట్టణ మహిళాఅధ్యక్షురాలు అర్షియాబేగం, ఏరియా వైద్యశాల డైరక్టర్ ఆత్మకూరి నాగలక్ష్మి, పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, ముస్లింనేతలు పాల్గొన్నారు.



## శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో యోగా డే వేడుకలు



**నెల్లూరు, జూన్17 ప్రభాతవార్త -విద్య** నగరంలోని స్థానిక దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం ఉదయం 7గంటల నుండి యోగాడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా ఆలయ కార్యనిర్వహణ అధికారి కోవూరుజనార్దన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మే21నుండి జూన్21 వరకు యోగా మాసాన్ని పాటించాలని కోరటం జరిగిందన్నారు. ఇందులో భాగంగా కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యాక్రమాన్ని నిర్వహిస్తున్నామ్నారు. యోగాతొ సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమౌతుందన్నారు. అందరూ విధిగా క్రీడలు, యోగా వంటి వాటిని చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయన శిబ్బంది, యోగా శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీలో యోగా డే వేడుకలు



**నెల్లూరు, జూన్17 ప్రభాతవార్త -విద్య** నగరంలోని స్థానిక ఆర్టీసీ ప్రధాన బస్టాండులో యోగా డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం మే21నుండి జూన్21 వరకు యోగా మాసాన్ని పాటించాలని కోరటం జరిగిందన్నారు. ఇందులో భాగంగా కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యాక్రమాన్ని నిర్వహిస్తున్నామ్నారు. యోగాతొ సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమౌతుందన్నారు. అందరూ విధిగా క్రీడలు, యోగా వంటి వాటిని చేపట్టాలనికోరారు. సుమారు 70మందికి పైగా నెల్లూరు 1,2డిపోల్లో సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యోగాగురువు జనార్దన్, నెల్లూరు 1డిపో డిఎం మురళీకృష్ణ, సిఐలు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధితచిన్నారికి లక్షా 39 వేల ఆర్థిక సాయం అందజేత



**నెల్లూరు, జూన్17 ప్రభాత వార్త-విద్య** అరుదైన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఏడేళ్ల చిన్నారి హర్షిణికి ఆంధ్రప్రదేశ్ పద్మశాలి యవసేన ఆర్థిక చేయూతని అందించి మానవత్వం చాటుకుంది. ప్రకాశం జిల్లా చీమ కుర్తికి చెందిన జంజనం హర్షిణి గత కొద్ది రోజులుగా క్యాన్సర్ వ్యాదితో బాధపడుతుంది, వైద్యానికి సుమారు 18లక్షలు ఖర్చు అవుతుందని చెప్పగా ఆర్థికంగా వెనుకబడిన చిన్నారి తండ్రి గోపీకృష్ణ ఆపన్న హస్తం కోసం ఎదురుచూశారు. విషయం తెలుసుకున్న యువసేన సభ్యులు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పద్మశాలీ కుటుంబ సభ్యులనుండి విరాళాలు సేకరించారు. 10 రోజుల్లో లక్షా 39వేల రూపాలయను సేకరించి బాధితురాలికి అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులుమాట్లాడుతు బాధితురాలిని ఆదుకునేందుకు గుంటూరు, చీమకుర్తి, ఆరివీడు పద్మశాలి సంఘాల సభ్యులు ముందుకు వచ్చారన్నారు. అలాగే కన్నా మాస్టారు మిగిలిన నగదును అందించటం జరిగిందన్నారు. నగదు సేకరణకు సహకరించిన అందిరికి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి పెద్దలు కన్నా మాస్టారు, గంజి చిరంజీవి, గుర్రం చిన్నవీరయ్య, సూరేపల్లి ఈశ్వరరావు, కస్తూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణ విషయంలో అలసత్వం విడనాడండి



**కోవూరు, జూన్ 17 ప్రభాతవార్త** : రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణాల విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించిందని, ప్రస్తుతం ప్రభుత్వ గృహాలు నిర్మించు కుంటున్న లబ్ధిదారులు నిర్మాణాలు మరింత వేగవంతం అయ్యేలా సంబంధిత సచివాలయ పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోమంగళవారం సచివాలయం పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల గృహ నిర్మాణాలు చేసుకునే వారికి నిధులు పెంచిన నేపథ్యంలో సంబంధిత లబ్దిదారుల్లో మరింత అవగాహన కల్పించి చేపట్టే నిర్మాణాలు మరింత వేగవంతం కావడమే కాకుండా సకాలంలో పూర్తయ్యేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వహించే ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి డీఈ వెంకటేశ్వర్లురెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

# కావలి వార్త రిపోర్టర్ నాగేశ్వరరావు అకాలమృతి





**కావలిరూరల్, జూన్17 ప్రభాతవార్త** కావలి వార్త జాతీయ దినపత్రిక సీనియర్ రిపోర్టర్, ఆర్.సి ఇంచార్జి ప్రముఖ ఆర్యవైశ్యప్రముఖులు ఓలేటి నాగేశ్వరరావు (65) అనారోగ్యం కారణంగా సోమవారం రాత్రి మృతిచెందడం జరిగింది. గత రెండు రోజుల క్రితం తీవ్రఅనారోగ్యానికిగురై నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. నాగేశ్వరరావు ఆకస్మికమృతిపట్ల పలువురు పార్టీనేతలు, ప్రజాసంఘాలు, వివిధ స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, విద్యాసంస్థల ప్రతినిధులు, వ్యాపారస్తులు, అనేకరంగాల ప్రముఖులు, జర్నలిస్ట్‌లు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేయడం జరిగింది. ఆయన మృతికి సంతాపంగా కావలి ఉదయగిరి బ్రిడ్జిసెంటర్ నందు, రైల్వేరోడ్డులోని జర్నలిస్ట్‌క్లబ్ నందు ఆయన చిత్రపటాన్ని ఏర్పాటుచేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. అనంతరం ఆయన స్వగృహంలోని ఆయన భౌతి కకాయాన్ని మంగళవారం పలువురు సందర్శించి, ఘనంగా నివాళులర్పించడం జరిగింది. అనంతరం వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఆయన అంత్యక్రియలు వారి స్వగృహం నుండి స్మశానవాటిక వరకు వందలాదిమందితో అంతిమయాత్ర కొనసాగింది.

**ఒకమహోన్నతమైన వ్యక్తిని కోల్పో యాం: ఎమ్మెల్యే**

ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్, ఆర్యవైశ్య నేత ఓలేటి నాగేశ్వరరావు మృతి నన్ను కలిచి వేసిం దని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలియచేశారు. మాట్లాడారు. ఓలేటి నాగేశ్వరరావు గత 40 సంవత్సరాలు జర్నలిస్ట్‌గా ఆయన అందించిన సేవలు ఎనలే నివని, ప్రజాసమస్యలను తన కలంతో వెలుగెత్తిచాటడంలో ఆయనఎప్పుడూ ముందుండే వారన్నారు. కావలి ప్రజలకు, జర్నలిజానికి



### పలువురు సంతాపం

తీరలిలోటు అని తెలియచేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

**నాగేశ్వరరావు మరణం బాధాకరమన్నారు... మాజీ ఎమ్మెల్యే**

ఆర్యవైశ్యప్రముఖులు, మంచి వ్యక్తి, సోదం సమానులు, మాకు అత్యంత ఆప్తులు వార్త జాతీయ దినపత్రిక సీనియర్ రిపోర్టర్ ఓలేటి నాగేశ్వరరావు మరణం అత్యంత బాధాకరమని కావలి నియో జకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలియ చేశారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢసా నుభూ తిని తెలియచేశారు.

**ఓలేటి మృతి పాత్రికేయరంగానికే తీరనిలోటు: బిఎంఆర్**

కావలి పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు, సీనియర్ రిపోర్టర్ ఓలేటి నాగేశ్వరరావుఅకాల మరణం పాత్రికేయరంగానికే కాకుండా, వ్యక్తిగతంగా కూడా నాకు తీరనిలోటు అని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావుతెలియచేశారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూ వారికి భగ వంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని కోరారు.

**-ఓలేటి లేరంటే నమ్మలేకపోతున్నా ...మాలేపాటి**

కావలి పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు, ప్రముఖ వార్త జాతీయ దినపత్రిక జర్నలిస్ట్ ఓలేటి నాగేశ్వరరావు మృతి నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని రాష్ట్ర ఆగ్రోఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు తెలియచేశారు. అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ, సరదాగా మాట్లాడే ఓలేటి ఇకలేరు నమ్మలేకపోతున్నానని తెలియచేశారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

**నాగేశ్వరరావు మరణం అత్యంత బాధాకరం: మాజీ ఎమ్మెల్యే**

ఆర్యవైశ్య ప్రముఖులు, వార్త దినపత్రిక సీనియర్ జర్నలిస్ట్ ఓలేటి నాగేశ్వరరావు ఆకస్మిక మృతిపట్ల మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మరణం అ త్యంత బాధాకరమని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

**ఓలేటి మృతిపట్ల తీవ్రదిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన అళహరి...**

ప్రముఖ వార్త జాతీయ దినపత్రిక జర్నలిస్ట్ ఓలేటి నాగేశ్వరరావు ఆకస్మిక మృతిపట్ల కావలి నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అందరిని ఆప్యాయతగా పలకరిస్తూ సరదాగా మాట్లాడే నాగేశ్వంరావు ఇకలేరంటే నమ్మలేకపోతున్నామని తెలిపారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతిని తెలియచేశారు.

# నగరంలో మరో హత్య



**నెల్లూరు క్రైమ్, జూన్ 17, ప్రభాతవార్త :** నగరంలో హత్యల పరంపర కొనసాగుతూనే ఉంది. కారణా లు ఏవైనా ఏదో ఒక పోలీస్ స్టేషన్ పరిధిలో ఏదో ఒక సందర్భంలో నెలలో ఒకటి రెండు సార్లు హత్య సంఘటనలు చోటు చేసుకుంటూ ఉండడం నగరవాసులను కలవరానికి గురిచేస్తుంది. తాజాగా నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తిని అతని తోటి స్నేహితులు హత్య చేయడమే కాకుండా తామే హత్య చేశామని ఇంట్లో ఉన్న శవాన్ని తీసుకెళ్లాలంటూ హతుని బంధువులకు సమాచారం ఇవ్వడం విశేషం. ఈ సంఘటన సంబంధించి పోలీసుల కథనం మేరకు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన జైహింద్ సహనీ (40) స్థానిక నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాస నగర్‌లో నివాసముంటూ ఇంటీరియర్ పనులు చేస్తుంటాడు. అతనితో పాటు అదే రాష్ట్రానికి చెందిన పరదేశి గౌతమ్, రామ్ కేసరిలు కూడా ఉపాధి నిమిత్తం ఇక్కడికి వచ్చి ముగ్గురు ఒకే గదిలో ఉంటూ పనులు చేసుకుంటూ ఉన్నారు. ఈ క్రమంలో వీరి ముగ్గురు మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో జైహింద్ పై కక్ష పెంచుకున్న మిగతా ఇద్దరు అతనిని అంతమొందించాలని నిర్ణయించి, సోమవారం రాత్రి పొద్దు పోయాక జైహింద్ తో గొడవపడి అతనిపై రోకలి, ఇనుప రాడ్తో దాడి చేసి తీవ్రంగా కొట్టారు. రక్తస్రావానికి గురైన జైహింద్ అక్కడికక్కడే మరణించాడు. వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయిన నిందితులు ఇద్దరు సమీపంలో నివాసం ఉంటున్న జైహింద్ బంధువులకు సమాచారం ఇచ్చి, తామే హత్య చేశామని, ఇంట్లో శవం ఉందని చెప్పడంతో బై కంప్లీతులైన జై హింద్ బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని చూడగా జైహింద్ విగతజీవిగా కనిపించాడు. వెంటనే నవాబుపేట పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న నవాబుపేట సీఐ వేణుగోపాల్ రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

## దుకాణంపైకి దూసుకెళ్ళిన మిని వ్యాన్ :ఇద్దరు మృతి



**దుత్తలూరు, జూన్17, ప్రభాతవార్తః** జాతీయ రహదారిపై వేగంగ వెళుతు అదుపుతప్పి మినీ వ్యాన్ దుకాణంపైకి దూసుకెళ్ళిన ఘటనలో ఇద్దరు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు జాతీయ రహదారిపై వేగంగ వెళుతున్న మినీవ్యాన్ అదుపుతప్పి దుకాణంలోకి దూసుకుపోగ ఆఘటనలో బ్రహ్మేశ్వరంకు చెందిన పరసుబోయిన వెంకటేశ్వర్లు (62), పర సుబోయిన స్వర్ణల త(57) భార్యాభర్తలు చనిపోయారు. మరో ఇద్దరికి గాయాలైనాయి. ప్రమాద విషయం తెలుసుకున్న దుత్త లూరు ఎస్ఐ ఆదిలక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్ట్ మర్టామ్‌కై ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను వైద్యంకై ఆదే ఆసుపత్రిలో చేర్పించారు.